సాక్షి నిర్మల్

ఆదివారం । 4 । ఫిబ్రవరి । 2024



ఉమ్మడి జిల్లాకు రూ.100 కోట్లు

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్) నిధులు రూ.100 కోట్లు మంజూరయ్యాయి. ఎమ్మెల్యేల విజ్ఞప్తులు లేకుండానే ప్రభుత్వం విడుదల చేసింది. 8లో▸



విదేశాల్లో ఉద్యోగాలకు 'టామ్‌కామ్'

రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఉపాధి కోసం ఇన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.1/18.8

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. చలి ప్రభావం చాలావరకు తగ్గుతుంది. వేకువ జామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

చట్టాలపై అవగాహన ఉండాలి

- జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి అజయ్‌కుమార్



మాట్లాడుతున్న జడ్జి అజయ్‌కుమార్

నిర్మల్ టౌన్: చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జిల్లా ప్రిన్సిపల్ జూనియర్ జడ్జి అజయ్‌కుమార్ సూచించారు. జిల్లా కేంద్రం భాగ్యనగర్‌లోని మహిళలకు చట్టాలపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగంలోని చట్టాలను వివరించారు. ప్రతి ఒక్కరికీ సైబర్ చట్టాలు, యాసిడ్ దాడులు, బాల్య వివాహాలు, గృహ హింస చట్టం, నిర్వహణ చట్టం, ట్రైబల్ రైట్స్‌కు సంబంధించిన న్యాయ సేవలపై అవగాహన ఉండాలన్నారు. బాలికల చట్టాలను ఎలా వినియోగించుకోవాలో వివరించారు. కార్యక్రమంలో నిర్మల్ చీఫ్ లీగల్ డిఫెన్స్ కౌన్సిల్ రాజలింగం, న్యాయవాదులు లింగగౌడ్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

రేపు నర్సారెడ్డి సంస్మరణ సభ

నిర్మల్‌చైన్‌గేట్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొద్దుటూరి నర్సారెడ్డి సంస్మరణ సభ ఈనెల 5న నిర్వహించనున్నట్లు డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు తెలిపారు. హైదరాబాద్‌లోని గాంధీ భవన్ ఇందిరాహాల్‌లో ఉదయం 11 గంటలకు సభ ఉంటుందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఏఐసీసీ అగ్ర నాయకులు హాజరవుతారని వివరించారు. నర్సారెడ్డి అభిమానులు, కాంగ్రెస్ నాయకులు హాజరు కావాలని కోరారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న టీఎన్జీవో నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం 2024 క్యాలెండర్‌ను ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు వెలుమల ప్రభాకర్, కార్యదర్శి కుడాల రవికుమార్ మాధ్యమిక జిల్లా అధికారి జె.పరశురాం, కళాశాల ప్రిన్సిపాల్ కరుణశ్రీతో కలిసి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు భూమేశ్వర్, జనరల్ సెక్రెటరీ ఏక్బాల్ అహ్మద్, వైస్ ప్రెసిడెంట్స్ అనిల్‌కుమార్, సీహెచ్.శాలిని, జాయింట్ సెక్రెటరీలు నారాయణ, రాజకుమారి, కోశాధికారి శ్రీధర్, పబ్లిసిటీ సెక్రెటరీ సయ్యద్ ఆఫీస్ అలీ, ఈసీ మెంబర్లు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు సీజ్



రైస్‌మిల్లుకు సీల్ వేస్తున్న అధికారులు

సారంగపూర్: మండలంలోని చించోలి(బి)గ్రామంలో, గోపాల్‌పేట్ వద్ద గల రైస్ మిల్లును ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శనివారం సీజ్ చేశారు. డీసీఎస్‌వో శ్రీకళ వివరాలు వెల్లడించారు.(290 క్వింటాళ్ల బియ్యానికి 1 ఏసీకే) రైస్‌మిల్లుకు 22 ఏసీకేలు ఖరీఫ్, 9 ఏసీకేలు రబీ పంటకు సంబంధించిన బియ్యం రావాల్సి ఉందన్నారు. సదరు రైస్‌మిల్లు యాజమాన్యం సీఎంఆర్ ధాన్యం నిర్లక్ష్యంగా ఆరుబయట నిలువ చేసి తడిసి చెడిపోవడానికి కారణం అయిందని పేర్కొన్నారు. దీంతో ఈనెల 10వ తేదీన సంబంధిత రైస్‌మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేశామని తెలిపారు. అయినా సదరు యజమాని స్పందించకపోవడంతో శనివారం రైస్‌మిల్లును సీజ్ చేశామని తెలిపారు. ఈదాడిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రవీందర్‌రెడ్డి, టీఏ తిరుపతిరెడ్డి ఉన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

నిర్మల్‌టౌన్: నిర్మల్ ఆర్టీసీ డిపోలో డ్రైవర్లకు రోడ్డు భద్రతపై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా రవాణాశాఖ అధికారి అజయ్ కుమార్‌రెడ్డి హాజరై మాట్లాడారు. కార్లు, బస్సులు నడిపే వారు తప్పకుండా సీటు బెల్టు పెట్టుకోవాలని సూచించారు. ట్రాఫిక్‌రూల్స్, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించాలన్నారు. సిగ్నల్ జంప్ చేయొద్దని, ఎదురుగా వచ్చే వాహనాలపై నమ్మకం పెట్టుకోకుండా మన డ్రైవింగ్ మనం చేయాలన్నారు. ముఖ్యంగా ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్ బెల్ కొట్టగానే రోడ్డు మధ్యలో కాకుండా పక్కకు ఆపాలని సూచించారు. డ్రైవర్లకు ఆర్టీసీ డ్రైవర్లు ఆదర్శంగా నిలవాలని తెలిపారు. డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి, అసిస్టెంట్ మేనేజర్లు ఐ.రాజశేఖర్, నవీన్‌కుమార్, సూపరింటెండెంట్ సంతోష్‌కుమార్, సెక్యూరిటీ హెడ్‌గార్డ్ ప్రభుదాస్, డ్రైవర్లు పాల్గొన్నారు.

రైలు కోసం.. బాండ్!



సమావేశంలో మాట్లాడుతున్న రైల్వేలైన్ సాధన సమితి ప్రతినిధులు



- రాసివ్వాలంటున్న సాధన సమితి
- మద్దతు పలికిన పలు సంఘాలు
- లోక్‌సభ ఎన్నికలవేళ.. 'లైన్'పై చర్చ
- జిల్లావ్యాప్త కార్యక్రమాలకు ప్లాన్

నిర్మల్: జిల్లావాసుల ఏళ్లనాటి కల సాకారం దిశగా లోక్‌సభ ఎన్నికల వేళ మళ్లీ కదలిక మొదలైంది. ఎంపీ ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ నిర్మల్ మీదుగా రైల్వేలైన్ వేయాలన్న డిమాండ్ బలపడుతోంది. ఇప్పటికే ఆదిలాబాద్‌లో రైల్వేలైన్ సాధన కోసం దీక్షలు, ధర్నాలు చేస్తుండగా, ఇప్పుడు నిర్మల్ లోనూ కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. 'నిర్మల్ రైల్వేలైన్ సాధన సమితి' పేరిట పలు సంఘాలు, సంస్థలకు చెందిన బాధ్యులంతా కలిసి తమ డిమాండ్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. రాజకీయంగా ఒత్తిడి పెంచేందుకు ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు రైల్వేలైన్ తీసుకువస్తామని బాండ్ పేపర్ రాసివ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఆర్మూర్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ వేయాలన్న ప్రధాన అంశంతో గ్రామస్థాయి నుంచి కార్యక్రమాలు చేపడతామంటున్నారు. ఇటీవల కేంద్రబడ్జెట్ నేపథ్యంలో జిల్లా నుంచి పలువురు బాధ్యులు ఢిల్లీవరకూ వెళ్లివచ్చారు. రైల్వేలైన్ కోసం సహకరించాలంటూ అక్కడ పలువురు ఎంపీలు, నేతలను కలిసి విన్నవించారు.

ఏళ్లుగా ఇదే కథ..

ఎప్పుడో.. 1990ల్లో మొదలైన నిర్మల్ రైలు కథ ఇప్పటికీ సాగుతూనే ఉంది. హైదరాబాద్ నుంచి నిర్మల్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వేలైన్ వేయాలన్న డిమాండ్ దశాబ్దాలుగా నలుగుతూనే వస్తోంది. 1991లో ఆదిలాబాద్ ఎంపీగా ఉన్నప్పుడు అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అప్పటి ప్రధాని పీవీ.నరసింహారావు దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత 2017లోనూ ప్రయత్నం చేశారు. అప్పటి సీఎం కేసీఆర్ కేంద్రంతో జాయింట్ వెంచర్‌కు ఒప్పుకున్నారు. కానీ రాష్ట్రవాటా నిధులు ఇవ్వక పెండింగ్‌లో పడింది. మళ్లీ.. గత సెప్టెంబర్‌లో నిర్మల్ మీదుగా రైల్వేలైన్ నిర్మాణానికి సంబంధించి రూ.5,706 కోట్లతో నిర్మాణానికి ప్రణాళికసిద్ధం చేసినట్లు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మూడు దశాబ్దాల క్రితం ఏదైతే ప్రతి పాదించారో.. అదే ఆదిలాబాద్–నిర్మల్–ఆర్మూర్–నిజామాబాద్–బోధన్–సంగారెడ్డి మీదుగా పటాన్‌చెరు వరకు రైల్వే లైన్‌ను మళ్లీ తెరపైకి తీసుకువచ్చారు. కానీ.. తాజా బడ్జెట్‌లో ఎలాంటి ప్రకటన చేయలేదు. దీంతో పార్లమెంట్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. ఇదే విషయంపై జిల్లా వాసుల్లో చర్చ నడుస్తోంది.

రైల్వేలైన్ అవసరం...



నిర్మల్ మీదుగా ఉత్తర–దక్షిణ భారతదేశ ప్రాంతాలను కలిపేలా రైల్వేలైన్ నిర్మించాల్సిన అవసరం ఉంది. రాష్ట్ర, దేశ అవసరాలతోపాటు నిర్మల్ ప్రాంత అభివృద్ధికి ఈ రైల్వేలైన్ కచ్చితంగా చేపట్టాలి. ఈమేరకు ఎన్నికల్లో పోటీచేసే ఎంపీ అభ్యర్థులు బాండ్ పేపర్ రాసివ్వాలి.

– ఎంసీ లింగన్న, చైర్మన్ నిర్మల్ రైల్వేసాధన సమితి

గ్రామస్థాయి నుంచి కార్యక్రమాలు..



నిర్మల్ రైల్వే సాధన సమితి పేరిట గ్రామస్థాయి నుంచి కార్యక్రమాలు చేడతాం. ఇప్పటికే జిల్లా నుంచి ఢిల్లీ వరకూ వెళ్లి విన్నవించి వచ్చాం. రైల్వేలైన్‌పై అవగాహన కల్పించేలా, ఉద్యమించేలా కార్యక్రమాలను చేపడతాం. అన్ని పార్టీలు, సంఘాలు సహకరించాలని కోరుతున్నాం.

– యాటకారి సాయన్న, కోచైర్మన్, నిర్మల్ రైల్వేసాధన సమితి

బాండ్ రాసిచ్చి..

'పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ ఎంపీగా పోటీచేసే అభ్యర్థులెవరైనా.. నిర్మల్ మీదుగా రైల్వేలైన్ ఏర్పాటు చేస్తామని ముందుగా బాండ్ పేపర్ రాసిచ్చి ప్రచారం చేపట్టాలి. గెలిచిన తర్వాత రైల్వేలైన్ తీసుకురావాలి.. ఇదే మా ఏకైక డిమాండ్.' అని నిర్మల్ రైల్వేలైన్ సాధన సమితి చైర్మన్, పెన్షనర్స్ సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ.లింగన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం నిర్మల్ రైల్వేసాధన సమితి, పెన్షనర్స్ సంఘం, సీనియర్ సిటిజన్స్ ఫోరం, నిర్మల్ డెవలప్‌మెంట్‌ఫోరం, టీఎన్జీవోస్ సంఘ తదితర సంఘాల బాధ్యులు సమావేశమయ్యారు. ఇందులో నిర్మల్ మీదుగా రైల్వేలైన్ కోసం అన్నివర్గాలు, పార్టీలు, సంఘాలు సమష్టిగా పనిచేయాలన్నారు. ఎన్నికల్లో పోటీచేసే ఎంపీ అభ్యర్థులు రైల్వేలైన్ కోసం పోరాడతామని స్వయంగా బాండ్‌పేపర్ రాసిచ్చి ప్రచారానికి రావాలని డిమాండ్ చేశారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ పసుపుబోర్డు తీసుకువస్తానని చెప్పి బాండ్‌పేపర్ రాసిచ్చి పోటీచేశారని గుర్తుచేశారు. గెలిచిన తర్వాత పసుపుబోర్డు తీసుకువచ్చారని, అలాగే నిర్మల్‌కు రైల్వేలైన్ తీసుకురావాలన్నారు. ఇటీవల ఢిల్లీ వెళ్లి కలిసిన బాధ్యులతో ప్రస్తుత ఎంపీ సోయం బాపురావు స్పందించిన తీరు సరికాదన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు బండి సంజయ్, అర్వింద్ సానుకూలంగా స్పందించడంపై ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో పెన్షనర్స్ సంఘం సెక్టార్ అధ్యక్షుడు విలాస్, రైల్వేసాధన సమితి కోచైర్మన్లు, టీఎన్జీవోస్ అధ్యక్షుడు వెల్మల ప్రభాకర్, యాటకారి సాయన్న, సమితి ప్రతినిధులు మూర్తి ప్రభాకర్, నిమ్మ గణేశ్, ఆయా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, రాబోయే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గ్రామాల్లో సర్పంచుల పదవీ కాలం ముగిసినందున ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక అధికారులతో పాలన సాగించాలన్నారు. ప్రత్యేక అధికారులుగా నియమితులైన వారికి గ్రామంపై సంపూర్ణ బాధ్యత, హక్కులు ఉంటాయని తెలిపారు. ఫిబ్రవరి 7 నుంచి 15 వరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్య డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు. చివరి రోజు గ్రామసభ నిర్వహించి పారిశుధ్య కార్మికులను సన్మానించాలన్నారు. వేసవిలో తాగునీటి సమస్యను అధిగమించేందుకు ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.కోటి చొప్పున ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలని సూచించారు. రాష్ట్ర పంచాయతీ రాజ్‌శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పాలన ప్రారంభమైన నేపథ్యంలో నూతన పంచాయతీరాజ్ చట్టం, గ్రామపంచాయతీ వీధి నిర్వహణ విధానాలు వంటి అంశాలపై ప్రత్యేక అధికారులకు అవగాహన కల్పించేందుకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్లకు సూచించారు. ఉపాధి హామీ పథకం కింద మంజూరైన పనులు ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వం గురుకులాలు పాఠశాలల్లో విద్యార్థులకు అందించే స్కూల్ యూనిఫాంలు మహిళా సంఘాలకు అప్పగించేలా చూడాలని తెలిపారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీలత, డీఆర్డీవో విజయలక్ష్మి, జెడ్పీ సీఈవో సుధీర్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

లక్కుంటేనే.. స్లాట్!



మీ సేవ కేంద్రం ఎదుట స్లాట్ బుకింగ్ కోసం దివ్యాంగుల నిరీక్షణ

ఈ ఫొటోలోని



దివ్యాంగుడి పేరు బొడ్డు సురేందర్. సోన్ మండలం న్యూవెల్మల్‌కు చెందిన సురేందర్ సదరం స్లాట్ బుకింగ్ కోసం శనివారం ఉదయం 6 గంటలకే జిల్లా కేంద్రంలోని మీసేవ కేంద్రానికి వచ్చాడు. 11 గంటలకు వరకు వేచి చేశాడు. సైట్ ఓపెన్ అయిన పది నిమిషాలకే బుకింగ్స్ క్లోస్ అని చూపింది. దీంతో నిరాశగా వెనుదిరిగాడు. మళ్లీ మార్చి వరకు నిరీక్షించాల్సిన పరిస్థితి.

ఈ ఫొటోలోని



దివ్యాంగుడి పేరు రాజేశ్వర్. రాచాపూర్ గ్రామానికి చెందిన ఈయన గతంలో సదరం సర్టిఫికెట్ తీసుకున్నాడు. గడువు ముగియడంతో రెన్యువల్ చేసుకోవాలని అధికారులు సూచించారు. దీంతో స్లాట్ బుకింగ్ కోసం నాలుగు నెలలుగా మీసేవ కేంద్రం చుట్టూ తిరుగుతున్నాడు. అయినా స్లాట్ దొరకడం లేదు. దీంతో పింఛన్ ఎక్కడ ఆగిపోతుందో అని ఆందోళన చెందుతున్నాడు.

- బుకింగ్ కోసం విద్యాంగుల పాట్లు!
- మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు
- పది నిమిషాల్లోనే అయిపోతున్న ఖైనం
- టోకెన్లు, సమయం పెంచాలని వేడుకోలు

నిర్మల్‌చైన్‌గేట్: వారంతా శారీరక వైకల్యం ఉన్నవారు.. దృష్టి, వినికిడి లోపంతో బాధపడుతున్నావారు. మానసిక దివ్యాంగులు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతీనెల నిర్వహించే సదరం సర్టిఫికెట్ కోసం స్లాట్లు బుక్ చేసుకునేందుకు పాట్లు పడుతున్నారు. స్లాట్ బుక్ చేసుకుంటేనే వైద్య పరీక్షలు నిర్వహిస్తుండడంతో వారంతా మీసేవ కేంద్రాల వద్ద స్లాట్ బుకింగ్ కోసం పడిగాపులు కాస్తున్నారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ పొందాలన్నా.. ఇప్పటికే ఉన్నవారు రెన్యువల్ చేసుకోవాలన్నా స్లాట్ బుకింగ్ తప్పనిసరి. క్యాంపు నిర్వహించే రెండు రోజుల ముందు స్లాట్ బుకింగ్ అవకాశం కల్పిస్తున్నారు. ఓపెన్ చేసిన పది నిమిషాల్లోనే స్లాట్‌లు అయిపోతున్నాయి. దీంతో దివ్యాంగులు మీసేవ కేంద్రాల వద్ద తెల్లవారుజాము నుంచే క్యూ కడుతున్నారు. శనివారం ఉదయం 6 గంటలకే జిల్లాలోని మీసేవ కేంద్రాల వద్దకు దివ్యాంగులు చేరుకున్నారు. నిర్వాహకులు మాత్రం 11 గంటలకు ఓపెన్ అవుతాయని చెప్పడంతో అప్పటి వరకు వేచి చూశారు. 11 గంటలకు దరఖాస్తుదారులు తమ పత్రాలు అందించి స్లాట్ బుకింగ్ చేస్తుండగానే క్లోస్ అయిపోయింది. దీంతో అప్పటి వరకు నిరీక్షించిన దివ్యాంగులు ఉసూరుమంటు వెనుదిరిగారు.

కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ

సదరం నమోదు కోసం దివ్యాంగులు మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఒక్కో కేంద్రంలో ఒకటి, రెండు స్లాట్లు మాత్రమే నమోదవుతున్నాయి. కొంతమందికే స్లాట్ నమోదవుతుండడంతో మిగతా వారు నిరాశ చెందుతున్నారు. స్లాట్ల సంఖ్య పెంచాలని దివ్యాంగులు కోరుతున్నారు. అంతేకాక దివ్యాంగులను గుర్తించే క్రమంలో ఎక్కువ శాతం వైకల్యం ఉన్నవారికి శాశ్వత ప్రాతిపదికన, మరికొందరికి కాలపరిమితితో సదరం సర్టిఫికెట్ ఇస్తుంటారు. గడువు ముగిసిన తర్వాత తిరిగి పరీక్షలు చేయించుకుని మళ్లీ సర్టిఫికెట్ పొందాలి. లేదంటే పింఛన్ మధ్యలో ఆగిపోయే అవకాశం ఉంది. మరోవైపు స్లాట్ బుకింగ్ కాకపోవడంతో ఆందోళన చెందుతున్నారు.

టోకెన్లు పెంచాలి..

సదరం క్యాంపుకు హాజరయ్యే దివ్యాంగులకు ఇచ్చే టోకెన్లు పెంచాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. వైకల్యం ప్రకారం పరీక్షలు నిర్వహిస్తున్నందున శారీరక వికలాంగులు, దృష్టిలోపం.. వినికిడి లోపం, మానసిక వైకల్యం తదితర సమస్యలు ఉన్న వారికి ప్రతీ విభాగానికి 200 టోకెన్లు ఇవ్వాలని కోరుతున్నారు. ప్రస్తుతం దివ్యాంగులందరికీ 200 టోకెన్లు మాత్రమే ఇస్తున్నారు. వీటిలోనే కొత్తవారు, రెన్యువల్ చేసుకోవాల్సిన వారు బుకింగ్ చేసుకోవాల్సిన పరిస్థితి. టోకెట్ లభించకపోతే మళ్లీ నెల రోజులు వేచి చూడాల్సిందే.



మీసేవ ఎదుట సర్టిఫికెట్లతో క్యూ

8 నెలలుగా తిరుగుతున్న...



ఇటీవల జరిగిన ఒక ప్రమాదంలో నా కాలు విరిగింది. ప్రభుత్వం అందజేసే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలంటే అధికారులు సదరం సర్టిఫికెట్ కావాలన్నారు సర్టిఫికెట్ కావాలని సోలెట్ బుకింగ్ కోసం 8 నెలలుగా మీసేవ కేంద్రం చుట్టూ తిరుగుతున్న. ఇప్పటి వరకు సోలెట్ దొరకలేదు.

– చిన్నయ్య, వెల్మల్

'పది' ఫలితాల్లో ఫస్ట్ ఉండాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- పరీక్షలపై రివ్యూ



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నిర్మల్ రూరల్: మార్చిలో జరగనున్న పదో తరగతి పరీక్షల ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో మళ్లీ ప్రథమ స్థానంలో నిలపాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. పది పరీక్షలపై జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, జిల్లా విద్యాశాఖ అధికారులతో కలెక్టరేట్‌లో శనివారం రివ్యూ నిర్వహించారు. గతేడాది జిల్లాను రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపిన విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ ఏడాది కూడా అదే స్ఫూర్తితో జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలన్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు 45 రోజుల ప్రత్యేక ప్రణాళిక ప్రకారం కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఒక్కో పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో మాట్లాడి గతేడాది సాధించిన ఫలితాలు, జీపీఏలు, ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన విద్యార్థుల వివరాలు, మెరుగైన ఫలితాల సాధనకు అమలు చేస్తున్న విధానాలను అడిగి తెలుసుకున్నారు. ఈసారి కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతీ విద్యార్థి ప్రగతిని సబ్జెక్టుల వారీగా పర్యవేక్షించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులు, వెనుకబడిన విద్యార్థులను దత్తత తీసుకుని, వారు ఉత్తీర్ణులయ్యేలా చూడాలన్నారు. ప్రతీరోజు ప్రత్యేక తరగతులు, స్లిప్ టెస్టులు నిర్వహించాలన్నారు. పేరెంట్స్ సమావేశం ఏర్పాటుచేసి తమ పిల్లలను నిత్యం పాఠశాలలకు పంపేలా చూడాలన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అత్యవసరమైతే తప్ప సెలవు పెట్టొద్దన్నారు. అడిషనల్ కలెక్టర్ కిశోర్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు 100% హాజరయ్యేల చూడాలన్నారు. విద్యార్థుల్లో పరీక్షలపై ఉన్న భయాలను తొలగించాలని సూచించారు. మానసికంగా సిద్ధం చేయాలని తెలిపారు. మరో అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ 45 రోజుల ప్రణాళికను పక్కగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు 100% హాజరును కలిగి ఉండాలన్నారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షలు మార్చి 18 నుంచి జరుగుతాయని తెలిపారు. ఈసారి మొత్తం 8,923 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాస్తారన్నారు. ఈనెల 5 నుంచి 12 వరకు వరకు ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అధికారులు గోపీచంద్, రాజేశ్వర్‌గౌడ్, అంబాజీ, గంగాధర్, సెక్టోరియల్ అధికారులు నర్సయ్య, శ్రీదేవి, ప్రవీణ్‌కుమార్, లింబాద్రి, మండల విద్యాశాఖ అధికారులు శంకర్, సుభాష్, మైసాజీ, మధుసూదన్, చంద్రకాంత్, ముత్యం, మండల నోడల్ అధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెకుముకి పోటీలు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు ఇస్తున్న డీఈవో

నిర్మల్ రూరల్: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లాస్థాయి చెకుముకి పోటీలు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ పరీక్షకు జిల్లాలోని 38 పాఠశాలలకు చెందిన 114 విద్యార్థులు హాజరయ్యారు. డీఈవో రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానశాస్త్రంపై అవగాహన కల్పించడంతోపాటు సృజనాత్మకశక్తి పెరగడానికి ఇలాంటి పరీక్షలు దోహదపడతాయన్నారు. ముఖ్య వక్తగా హాజరైన డాక్టర్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలన్నారు. తమ ఇంటి పరిసరాలు, పాఠశాల పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఆహార వ్యర్థాలను పరిసరాల్లో పడేయొద్దని తెలిపారు. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని తెలిపారు.

విజేతలు వీరే...

జిల్లా స్థాయి పరీక్షలో ప్రథమం(తెలుగు మీడియంలో) : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కుభీర్, ఇంగ్లిష్ మీడియంలో– జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భోసి విద్యార్థులు, ప్రైవేట్(ఇంగ్లిష్ మీడియం) – శాంతి నికేతన్ నిర్మల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయికి అర్హత సాధించారు. విద్యార్థులకు డీఈవో రవీందర్ రెడ్డి ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గాజర్ల నారాయణ వర్మ, గౌరవ అధ్యక్షులు ఆకుల సుదర్శన్, కొండా రాములు, పర్యావరణ కమిటీ కన్వీనర్ సల్లా పోశెట్టి, కార్యదర్శులు రఫీక్, బచ్చు శ్రీనివాస్, వందన, రాష్ట్ర కార్యదర్శి గజపల్లి నర్సయ్య పాల్గొన్నారు.

ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దు

- ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

భైంసారూరల్: సెల్‌ఫోన్ మాట్లాడుతూ ఎట్టి పరిస్థితిలో డ్రైవింగ్ చేయవద్దని భైంసా ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మండలంలోని తిమ్మాపూర్ నుంచి వానల్‌పాడ్ వరకు శనివారం హెల్మెట్ ధరించి ద్విచక్రవాహనాల ర్యాలీని ప్రారంభించారు. అనంతరం వానల్‌పాడ్ గ్రామంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించొద్దని సూచించారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మూలమలుపుల వద్ద ఎదుటి వాహనాలను గమనించి ముందుకు వెళ్లాలన్నారు. జాతీయ రహదారులపై ఎక్కడ పడితే అక్కడ వాహనాలు నిలుపొద్దని సూచించారు. వాహనాల టైర్లు, బ్రేకులు, క్లచ్, గేరుబాక్సులు చెక్‌చేసుకున్నాకే నడపాలన్నారు. ట్రాఫిక్ నియమాలు పాటిస్తూ ముందుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో భైంసారూరల్ సీఐ నైలు, ఎస్సై శ్రీకాంత్, నాయకులు రాజన్న, రాంకుమార్, లస్మన్న, వాహనదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఏఎస్పీ కాంతిలాల్‌పాటిల్

మళ్లీ సీసీఐ కొనుగోళ్లు

భైంసా: సీసీఐ కొనుగోళ్లు మళ్లీ ప్రారంభమవుతాయని మార్కెటింగ్ ఏడీఎం అశ్వక్‌హైమద్ తెలిపారు. పత్తి రైతులు పుకార్లు నమ్మొద్దని సూచించారు. పత్తి నాణ్యతను బట్టి సీసీఐ ధర చెల్లిస్తుందని తెలిపారు. పత్తి రైతుల కోసం జిల్లాలో నిర్మల్, సారంగాపూర్, భైంసా, కుభీర్‌లో సీసీ ఐ కొనుగోలు కేంద్రాలు తెరిచిందన్నారు. సీసీఐ కొనుగోళ్లు ఉండవని చేస్తున్న ప్రచారాన్ని నమ్మొద్దన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు కాస్త విరామం ఇచ్చామన్నారు. త్వరలోనే తిరిగి ప్రారంభమవుతాయని తెలిపారు.

క్లుప్తంగా

సత్యశోధక పెళ్లి చేయడం అభినందనీయం

ఆదిలాబాద్‌రూరల్‌: మహాత్మ జ్యోతిరావు పూలే దంపతులు 1873లో స్థాపించిన సత్యశోధక సమాజ నియమాలకు అనుగుణంగా తెలంగాణ రాష్ట్రంలో అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్‌ పెట్కులే అతడి కుమారుడు చిరంజీవి కార్తీక్‌ వివాహం 2022లో, మళ్లీ తన కూతురి వివాహం ఫిబ్రవరి 25న చేయనుండడం అభినందనీయమని అఖిల భారతీయ మాలీ మహా సంఘం మహారాష్ట్ర రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్‌ రాజేంద్ర మహాదోడే అన్నారు. శనివారం నాగపూర్‌ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌ గల సమావేశ మందిరంలో జరిగిన ఓబీసీ సమ్మేళనంలో సుకుమార్‌ పేట్కులే పాల్గొన్నారు. ఇందులో పూణేకి చెందిన రఘునాథ్‌ డోక్‌ మరాఠీలో రాసిన సత్యశోధక వివాహ పద్ధతి అనే పుస్తకాన్ని సుకుమార్‌ పెట్కులే తెలుగులో అనువాదించారు. మరాఠీ తెలుగు భాషల్లో ఉన్న పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం రాజేంద్ర మాట్లాడుతూ కేవలం చెప్పడమే కాదు చేతల ద్వారా సుకుమార్‌ పెటుకలే పూలే ఆశయ సాధనకు, మాలీల ఐక్యతకు, వారి హక్కుల సాధన కోసం కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోసరే మాలీ సంఘటన్‌, నాగపూర్‌ వ్యవస్థాపకులు కృష్ణాజీ మహాడోలే, సంఘ సభ్యులు డి ఉత్తం రావు, ఈశ్వర్‌ ధోలే, వసంత్‌ సోనులే, రామ్‌ బెండరే, ప్రవీణ్‌ పాల్గొన్నారు.

రైలు నుంచి పడి ఒకరికి గాయాలు


ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

తాంసి: రైలు నుంచి పడి ఒకరికి గాయాలైన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాల ప్రకారం... తలమడుగు మండలంలోని అందర్‌బంద్‌ గ్రామానికి చెందిన నాగోరావు జిల్లా కేంద్రం నుంచి మహారాష్ట్ర వైపు వెళ్లే రైలులో తలమడుగు మండల కేంద్రానికి వెళ్తున్నాడు. రైలులో డోర్‌ వద్ద నిల్చొని ఉండగా ప్రమాదవశాత్తు రైలు నుంచి పట్టాలపై పడ్డాడు. ఈ ప్రమాదంలో ఒక కాలు పూర్తిగా తెగిపోయింది. గాయపడిన వ్యక్తిని గుర్తించిన రైల్వే సిబ్బంది అదే రైలులో తలమడుగు మండల కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి నుంచి అంబులెన్స్‌లో రిమ్స్‌ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నాగోరావు చికిత్స పొందుతున్నాడు.

గాయపడిన డ్రైవర్‌ మృతి

ఇచ్చోడ: మండల కేంద్రంలోని ఆదిలాబాద్‌ బైపాస్‌ జాతీయ రహదారి వద్ద రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌ షమీర్‌ (36) శనివారం సాయంత్రం రిమ్స్‌లో మృతి చెందినట్లు ఎస్సై నరేష్‌ తెలిపారు. నాగ్‌పూర్‌ నుంచి హైదరాబాద్‌ వైపు వెళ్తున్న లారీ శుక్రవారం రోడ్డు పక్కన ఉన్న లారీని ఢీ కొట్టింది.

ఉమ్మడి జిల్లాకు రూ.100 కోట్లు

- ఎస్‌డీఎఫ్‌ నిధుల వినియోగ బాధ్యత ఇన్‌చార్జి మంత్రికి
- ఎమ్మెల్యేలు అడగకుండానే రూ.10కోట్ల చొప్పున కేటాయింపు
- మార్చి నెలాఖరు వరకు వాటి ఖర్చుకు అవకాశం
- ఉత్తర్వులు జారీ చేసిన రేవంత్‌రెడ్డి సర్కారు



కైలాస్‌నగర్‌: ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాకు ప్రత్యేక అభివృద్ధి నిధి (ఎస్‌డీఎఫ్‌) నిధులు రూ.100 కోట్లు మంజూరయ్యాయి. రాష్ట్ర చరిత్రలో ఎమ్మెల్యేల విజ్ఞప్తులు లేకుండానే తెలంగాణ ప్రభుత్వం ఆ నిధులను విడుదల చేసింది. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని పది నియోజకవర్గాలకు వంద కోట్లు కేటాయిస్తూ జీవో నం.1687ను జారీ చేసింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన పూర్తి బాధ్యతలను ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు అప్పగించింది. ఈ నిధులను మార్చి 31వ తేదీలోగా ఖర్చు చేసేందుకు అవకాశం కల్పించింది. ఈ నిధుల వినియోగానికి సంబంధించిన ప్రతిపాదనలను ఎమ్మెల్యేలు సంబంధిత అధికారుల ద్వారా జిల్లా ఇన్‌చార్జి మంత్రికి నివేదించాల్సి ఉంటుంది. సీతక్క ఆదేశాల మేరకు వాటిని వెచ్చించాలి. ఈ నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యేలు తమ తమ నియోజకవరాల్లో చేపట్టే పనుల ప్రతిపాదనల కసరత్తులో నిమగ్నమయ్యారు.

ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం

ఎస్‌డీఎఫ్‌ నిధుల వినియోగంలో ప్రభుత్వం విద్యారంగానికి ప్రత్యేక ప్రాధాన్యతనిచ్చింది. ఒక్కో ఎమ్మెల్యేకు కేటాయించిన రూ.10కోట్లలో రూ.2కోట్లను ప్రభుత్వ, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఖర్చు చేయాలని ఆదేశించింది. మరో కోటి రూపాయలను అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు వెచ్చించాలని సూచించింది. మరో రూ.50లక్షలను కలెక్టర్‌, జిల్లా అధికారుల ప్రతిపాదనల మేరకు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ కోసం వినియోగించాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొంది. పాఠశాలలు, తాగునీరు, కార్యాలయాల నిర్వహణకు సంబంధించి రూ.3.5 కోట్లు పోగా మిగిలిన రూ.6.5 కోట్లను తమ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులకు వినియోగించుకోవచ్చని ఎమ్మెల్యేలకు సూచించింది. ఈ నిధులను మార్చి 31వ తేదీలోగా ఖర్చు చేయాల్సిందిగా ఆదేశించింది. ఈ నిధులతో చేపట్టిన పనులు పారదర్శకంగా జరిగేలా ప్రత్యేక తనిఖీలు చేయాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది. తద్వారా నాణ్యత ప్రకారంగానే జరిగేందుకు అవకాశం ఉంటుంది. ఈ నిధుల కేటాయింపుపై ఎమ్మెల్యేల్లో హర్షాతిరేకలు వ్యక్తమవుతున్నాయి. గతంలో పలుమార్లు విన్నవించినా నిధులు విడుదలయ్యేవి కావని, ప్రస్తుత ప్రభుత్వం అడగకుండానే పది కోట్ల ప్రత్యేక నిధులను కేటాయించడంపై వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేలు అడగకుండానే ...

సాధారణంగా ఎస్‌డీఎఫ్‌ నిధులను ఎమ్మెల్యేల విజ్ఞప్తుల మేరకే ప్రభుత్వం విడుదల చేస్తోంది. తమ నియోజకవర్గ పరిధిలో ఫలాన పనులు చేపట్టాల్సి ఉందని, అందు కు ప్రత్యేక నిధులను కేటాయించాలని ఎమ్మెల్యేలు సీఎంను కోరితే అందుకనుగుణంగా నిధులు విడుదలయ్యేవి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రంతో పాటు తెలంగాణలోని పదేళ్ల బీఆర్‌ఎస్‌ పాలనలో ఇలాగే జరిగేది. కానీ కొత్తగా బాధ్యతలను చేపట్టిన రేవంత్‌రెడ్డి సర్కారు ఎమ్మెల్యేలు అడగకుండానే ఒక్కొక్క నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున నిధులను కేటాయించింది. ఇలా ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలోని పది నియోజకవర్గాలకు వంద కోట్ల నిధులను విడుదల చేస్తూ జీఓ జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లాలో పది అసెంబ్లీ నియోజకవర్గాలకు బీజేపీ, కాంగ్రెస్‌ చెరో నలుగురు ఎమ్మెల్యేలు ఉండగా బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యేలు ఇద్దరు ఉన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేలతో పాటు విపక్ష పార్టీల ఎమ్మెల్యేలు సైతం తమతమ నియోజకవర్గాల్లో అభివృద్ధి పనులను చేపట్టేందుకు వీలుగా ప్రభుత్వం నిధులను విడుదల చేసింది.


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
Special Development Fund – According Administrative Sanction for an amount of Rs.1,190.00 crore @ Rs.10.00 crore per Assembly Constituency for taking up developmental works in the districts to be approved by the District in-charge Ministers, earmarked an amount of Rs.2.00 crore towards Education Infrastructure (Government / Local Body), Rs.1.00 crore for Drinking water and Rs.50.00 lakh for maintenance of Collectorates / Govt. offices purposes per Assembly Constituency under SDF-2023-24 – Issued.
PLANNING (VI) DEPARTMENT
G.O.Rt.No.22 Date: 30.01.2024
Read
G.O.Ms.No.1687, General Administration (Poll B) Department, dated 24.12.
ORDER:
Government have decided to provide an amount of Rs.1,190.00 crore @ Rs.10.00 crore per Assembly Constituency for taking up developmental works in the districts to be approved by the District in-charge Ministers, earmarking of Rs.10.00 crore per each Assembly Constituency an amount of Rs.2.00 crore towards Education Infrastructure (Government / Local Body), Rs.1.00 crore for Drinking water and Rs.50.00 lakh for maintenance of Collectorates / Govt. offices purposes under the scheme "Special Development Fund for Welfare and Development Activities" during the year 2023-24.
After careful examination, Government hereby accord administrative sanction for Rs.1,190.00 crore @ Rs.10.00 crore per Assembly Constituency for taking up developmental works in the districts to be approved by the District in-charge Ministers earmarking out of Rs.10.00 crore per each Assembly Constituency an amount of Rs.2.00 crore towards Education Infrastructure (Government / Local Body), Rs.1.00 crore for Drinking water and Rs.50.00 lakh for maintenance of Collectorates / Govt. offices purposes for the districts mentioned below.

ప్రభుత్వం జారీ చేసిన జీవో

సీఎం పర్యటన పూర్తిగా రాజకీయం


మాట్లాడుతున్న తుడందెబ్బ డివిజన్‌ అధ్యక్షుడు ప్రభాకర్‌

- తుడందెబ్బ డివిజన్‌ అధ్యక్షుడు కనక ప్రభాకర్‌

నార్నూర్‌: ఈ నెల 2న ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్‌ నాగోబా దర్శనం, అమరవీరుల స్థూపం పర్యటన కేవలం రాజకీయ స్వలాభం కోసం మాత్రమేనని తుడుం దెబ్బ డివిజన్‌ అధ్యక్షుడు కనక ప్రభాకర్‌ ఆరోపించారు. ఆదివాసీ గిరిజనుల ఆరాధ్యదైవం కేస్లాపూర్‌ దైవ సన్నిధిలో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చి కనీసం ఆదివాసీ సమస్యల మీద మాట్లాడకపోవడం, తుడుం దెబ్బ రాష్ట్ర జిల్లా స్థాయి నాయకులు వివిధ సంఘాల పెద్దలు అనుమతి తీసుకుని కలవడానికి ఉదయం నుంచి వేచి చూసినా నిరాశే ఎదురైందన్నారు. ఆదివాసీ సమస్యలు వినేందుకు కనీసం 5 నిమిషాలు కూడా కేటాయించకపోవడంపై ఆదివాసీ గిరిజనులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. ఇది ముమ్మాటికీ ఎన్నికల డ్రామా మాత్రమే అనే విషయాన్ని ఆదివాసీ ప్రజలు గ్రహించాలన్నారు. కనీసం ఆదివాసీల సమస్యలపై ఎటువంటి హామీ ఇవ్వలేదని, డిమాండ్స్‌పై మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ డివిజన్‌ నాయకులు మెస్రం మానిక్‌రావ్‌, తుడుం దెబ్బ మండల నాయకులు అడ శ్రీరామ్‌, మెస్రం హన్మంత్‌, అర్క గోవింద్‌, ఉర్వేత రుప్‌దేవ్‌, ఆనందరావ్‌, పెందుర్‌ దీపక్‌ పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి

- అసిస్టెంట్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో


మాట్లాడుతున్న అసిస్టెంట్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో

ఆదిలాబాద్‌రూరల్‌: వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలని అసిస్టెంట్‌ కలెక్టర్‌ వికాస్‌ మహతో అన్నారు. బీసీ స్టడీ సర్కిల్‌ సెంటర్‌ ఆదిలాబాద్‌ ఆధ్వర్యంలో అందించనున్న ఉచిత గ్రూప్‌ 1, 2, 3, 4 ఫౌండేషన్‌ శిక్షణ తరగతులను ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బీసీ స్టడీ సర్కిల్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో నాలుగు నెలల వివిధ పోటీ పరీక్షలకు ఉచితంగా అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా ప్రణాళికలను సిద్ధం చేసుకుని గతంలో పోటీ పరీక్షల్లో వచ్చినా ప్రశ్నలను పరిశీలించుకోవాలన్నారు. స్టడీ సర్కిల్‌ సెంటర్‌ ఆధ్వర్యంలో నిర్వహించే వీక్లీ, డైలీ టెస్టులకు తప్పని సరిగా హాజరు కావాలన్నారు. దీంతో మనం చేసే పొరపాట్లు సరిదిద్దుకోవడానికి ఆస్కారం ఉంటుందన్నారు. టెస్టులలో పాల్గొనే అభ్యర్థులకు ఏబీసీడీ గ్రేడ్‌లను కేటాయించాలన్నారు. గ్రేడ్లు కేటాయించడం ద్వారా వారిలో పోటీ పెరిగి మంచి మార్కులు సాధించుకున్నేందుకు ఆస్కారం ఉంటుందన్నారు. నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించేందుకు కష్టపడి చదువుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ అభివృద్ధి అధికారి రాజలింగు, స్టడీ సర్కిల్‌ సెంటర్‌ డైరెక్టర్‌ ప్రవీణ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు మీకెక్కడిది

- మాజీ ఎమ్మెల్యే రామన్నపై భోజారెడ్డి ధ్వజం


సమావేశంలో మాట్లాడుతున్న అడ్డి భోజారెడ్డి

కైలాస్‌నగర్‌: రైతు రుణమాఫీ, డబుల్‌ బెడ్‌ రూం ఇండ్లు, గొర్రెల పంపిణీ పథకాలను అమలు చేయడంలో విఫలమైన బీఆర్‌ఎస్‌ నాయకులకు ప్రజా ప్రభుత్వాన్ని ప్రశ్నించే హక్కు లేదని ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా డీసీసీబీ చైర్మన్‌ అడ్డి భోజారెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవా భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 420 హామీలిచ్చి అమలు చేయకపోవడంతోనే ప్రజలు బీఆర్‌ఎస్‌ను ఇంటికి పంపించారన్నారు. అయిన ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న ఇంకా అధికారంలో ఉన్నట్లుగానే మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లోనే అమలు చేస్తామని సీఎం రేవంత్‌ రెడ్డి ప్రకటించారని, అధికారంలోకి వచ్చిన ఐదు రోజుల్లోనే రెండు హామీలను అమలు చేశామని గుర్తు చేశారు. మరో రెండు హామీలను ఈ నెలాఖరులోగా అమలు చేస్తామన్నారు. తమ ప్రభుత్వంపై, ఆరు గ్యారంటీల అమలుపై బీఆర్‌ఎస్‌ నాయకులు అనవసరంగా మాట్లాడితే ఊరుకోబోమని హెచ్చరించారు. తమదీ దొరల పాలన కాదని, ప్రజా ప్రభుత్వమన్నారు. బీఆర్‌ఎస్‌ హయాంలోనూ రైతుబంధు ఆలస్యంగా వచ్చిన విషయం మరిచిపోకూడదన్నారు. ఎన్నికలుంటే తప్ప రైతుబంధు డబ్బులు సమయానికొచ్చేవికావని ఎద్దేవా చేశారు. రైతు రుణమాఫీని ఎందుకు అమలు చేయలేదో బీఆర్‌ఎస్‌ నాయకులు రైతులకు సమాధానం చెప్పాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టునైనా పదేళ్లలో పూర్తిచేశారా అంటూ ప్రశ్నించారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కాకుండానే పథకాలపై బీఆర్‌ఎస్‌ నేతలు విమర్శలు చేయటం సరికాదన్నారు. ఇంద్రవెల్లిలోని అమరువీరుల స్థూపం వద్ద తెలంగాణ పునర్నిర్మాణ సభ విజయవంతమైందన్నారు. పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేసిన కార్యకర్తలు, ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్‌ పార్టీ నాయకులు సంతోష్‌రావ్‌, భోజారెడ్డి, షాహెద్‌ అహ్మద్‌, ఖిజర్‌ పాషా, అశోక్‌ రెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ‘టామ్‌కామ్‌’

- నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం చేయూత
- శిక్షణతో పాటు వివిధ కంపెనీల ఇంటర్వ్యూలు
- ఏజెంట్ల మోసాలకు చెక్‌



బోథ్‌: నిరుద్యోగ యువత ఉద్యోగ అన్వేషణలో భాగంగా ఉపాధిని వెతుక్కుంటూ విదేశాల బాటపడుతున్నారు. గతంలో వీసా, పాస్‌పోర్టులను పొందడం దగ్గర నుంచి ఉద్యోగాలిప్పించే వరకూ బాధ్యత మాదేనని చెప్పే ఏజెంట్లను ఆశ్రయించి యువత, నిరుద్యోగులు మోసాలకు గురైన సంఘటనలు అనేకం. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వమే చొరవ తీసుకుని తెలంగాణ ఓవర్సీస్‌ మ్యాన్‌పవర్‌ కంపెనీ లిమిటెడ్‌ (టామ్‌కామ్‌) విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ వెబ్‌ సైట్‌లో ఉపాధి అవకాశాలు, పనిచేసే కంపెనీ పేరు, జీతం వంటి విషయాలు పారదర్శంగా నమోదై ఉంటాయి. దరఖాస్తు చేసుకున్న యువతకు ఆయా రంగాల్లో ప్రభుత్వమే శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. గల్ఫ్‌ దేశాల్లోని వివిధ రంగాల కంపెనీలతో ప్రభుత్వం ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకుంది. ఆయా కంపెనీలకు అవసరమైన ఉద్యోగులను ప్రభుత్వమే ఎంపిక చేసి పంపనుంది.

ఆరోగ్య రంగంలో ఉపాధి అవకాశాలు..

గల్ఫ్‌ దేశాల్లో కొత్తగా 65 బిలియన్‌ డాలర్లతో 700లకు పైగా ఆరోగ్య రంగంలో ప్రాజెక్టులు ప్రారంభమవుతున్నాయి. పెద్ద ఎత్తున కొత్త ఆస్పత్రులు కొలువుదీరనున్నాయి. వీటికి అవసరమైన వైద్యులు, ఫార్మాసిస్టులు, ల్యాబ్‌ టెక్నీషియన్లు, నర్సులు, పరిపాలనా సిబ్బందిని అక్కడి ప్రభుత్వాలు చేపడుతున్నాయి. స్థానికంగా సిబ్బంది కొరత కారణంగా విదేశీయులకు భారీ సంఖ్యలో ఉపాధి కల్పించడానికి సన్నాహాలు చేస్తున్నాయి. గల్ఫ్‌ దేశాల్లో ఆరోగ్య రంగం పురోగతి ఆశాజనకంగా మారిన నేపథ్యంలో పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ అయిన ‘టామ్‌ కామ్‌’ సన్నద్ధమవుతోంది.

మోసాలకు చెక్‌ పెట్టేందుకు..

ఉన్న ఊరిలో ఉపాధి కరువైన తరుణంలో జిల్లా నుంచి యేటా దాదాపు వేల సంఖ్యలో యువత ఎడారి దేశాలకు వలస వెళ్తున్నారు. పదోతరగతి మొదలుకొని, ఇంటర్‌, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు సైతం అదేబాటలో పయనిస్తున్నారు. వీరికి ఏజెంట్లు చెప్పేది ఒకటైతే గల్ఫ్‌ దేశాల్లో జరుగుతున్నది మరొకటి.

ఇలా దరఖాస్తు చేసుకోవాలి..

టామ్‌కామ్‌ వెబ్‌సైట్‌ ద్వారా దరఖాస్తు చేయవచ్చు. టామ్‌కామ్‌ ఉద్యోగాల కోసం నోటిఫికేషన్‌ వెలువరిస్తుంది. టామ్‌ కామ్‌ నుంచి దరఖాస్తు చేసుకున్న వారికి ఫోన్‌ నంబర్‌ లేదా ఈ మెయిల్‌ ఐడీకి సమాచారం వస్తుంది. వారు ఇంటర్వ్యూలకు వెళ్లాల్సి ఉంటుంది. ఇందులో సెలక్ట్‌ అయిన వారు విదేశాల్లో సంబంధిత కంపెనీల్లో ఉద్యోగావకాశం లభిస్తుంది. రాష్ట్రంలో టామ్‌కామ్‌ ద్వారా 330 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రస్తుతం గబాన్లో 30, ఓమన్‌ 50, ఖాతార్‌లో 93, సూడాన్‌లో 2, యూఎఈలో 155 మంది వివిధ కంపెనీలలో ఉద్యోగాలు చేస్తున్నారు.

టామ్‌కామ్‌ ద్వారానే విదేశాలకు వెళ్లాలి



ఎంతోమంది యువకులు ఏజెంట్లు చేసే మోసాలకు బలవుతున్నారు. వీరిని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ ప్రభుత్వం టామ్‌కామ్‌ను ఏర్పాటు చేసి, దీని ద్వారా ప్రభుత్వమే విదేశాలకు పంపిచడం మంచిదే. దీంతో నిరుద్యోగులు ఎటువంటి మోసాలకు గురికాకుండా విదేశాల్లో ఉద్యోగం చేయవచ్చు. ప్రభుత్వం టామ్‌కామ్‌ ప్రజలకు అవగాహన కల్పించాలి. యువకులకు శిక్షణ ఇచ్చి వారికి ఉద్యోగ కల్పనకు ప్రభుత్వం కృషి చేయాలి.

– అల్లం సాయికృష్ణ, పోటీపరీక్షల నిపుణులు

అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు


సిడాం వినేష్‌(ఫైల్‌)

ఇంద్రవెల్లి: అనుమానాస్పదస్థితిలో యువకుడు మృతిచెందిన సంఘటన శనివారం మండలంలోని పాలుండిగూడ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. ఎస్సై దుబ్బక సునీల్‌, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... ఉట్నూర్‌ మండలంలోని చింతకర గ్రామానికి చెందిన సిడాం లక్ష్మణ్‌, కమలబాయి దంపతులకు కుమారుడు వినేష్‌(22) ఆటో నడుపుకుంటూ తల్లిదండ్రులకు ఆసరాగా ఉంటున్నాడు. అయితే మండలంలోని పాలుండిగూడ గ్రామానికి చెందిన ఓ యువతితో ఏడాది క్రితం పరిచయం ఏర్పడింది. ఆ యువతితో పెళ్లి విషయంలో వినేష్‌ కుటుంబ సభ్యులు ఒప్పుకోలేదు. అయినప్పటికీ కుటుంబ సభ్యులకు తెలియకుండా అప్పుడప్పుడు పాలుండిగూడకు వెళ్లి సదరు యువతిని కలిసేవాడు. అందులో భాగంగా శుక్రవారం రాత్రి పాలుండిగూడ గ్రా మంలో అతడి దగ్గరి బంధువుల ఇంటికి వెళ్లాడు. రాత్రి బహిర్భూమికి వెళ్తానని బంధువులకు చెప్పి బయటకు వచ్చిన వినేష్‌ తిరిగి ఇంటికి రాలేదు. దీంతో యువకుడి బంధువులైన గజానంద్‌, కేశవ్‌లు గాలించగా బరద్వల్‌ బహదుర్‌సింగ్‌ వ్యవసాయ చేనులో స్పృహ కోల్పోయి కనిపించాడు. ఇంటికి తీసుకొస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎస్సై శనివారం ఉదయం పాలుండిగూడ గ్రామానికి చేరుకుని వివరాలు సేకరించాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. వినేష్‌ మృతితో చింతకర గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

పీహెచ్‌సీని సందర్శించిన హ్యూమన్‌ రైట్స్‌ ప్రతినిధులు


రోగుల ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న ప్రతినిధులు

నేరడిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని హ్యూమన్‌ రైట్స్‌ జిల్లా ప్రతినిధులు శనివారం సందర్శించారు. ఆస్పత్రిలోని వసతులను పరిశీలించడంతో పాటు చికిత్స పొందుతున్న రోగుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ డాక్టర్‌ సద్దాంను మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని గుత్పాల గ్రామంలో అనేక మంది ప్రజలు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు. గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించాలని తెలిపారు. దీనిపై డాక్టర్‌ స్పందిస్తూ ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎన్‌టి రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి అమత్‌ కుమార్‌, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలి


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఎంపీ, ఉపాధ్యాయులు

ఖానాపూర్‌: విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదిగేలా చదివి తల్లిదండ్రులు, గురువులకు మంచి పేరు తేవాలని ఆదిలాబాద్‌ ఎంపీ సోయంబాపురావు, ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సూచించారు. మండలంలోని మస్కాపూర్‌ గ్రామంలో ప్రైవేట్‌ పాఠశాలల యూనియన్‌(ట్రస్మా) ఆధ్వర్యంలో ఖానాపూర్‌, కడెం, పెంబి, దస్తురాబాద్‌ మండలాల ప్రైవేట్‌ పాఠశాలల ఉపాధ్యాయులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయులు పిల్లలను ఓపికతో చదివించి వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. ట్రస్మా నాయకుల ప్రతిపాదన మేరకు నిర్మల్‌ జిల్లా ట్రస్మా భవనానికి రూ.10 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా 2023–24 విద్యాసంవత్సరం ప్రైవేటు పాఠశాలల్లోని 52 మందికి అబ్దుల్‌ కలాం ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డులను ప్రదానం చేశారు. ట్రస్మా స్టేట్‌ అడ్వైజర్‌ యాదగిరి శేఖర్‌రావు మాట్లాడారు. ప్రైవేట్‌ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఆరోగ్యభద్రతకు ప్రభుత్వం హెల్త్‌ కార్డులు ఇవ్వాలని కోరారు. ట్రస్మా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్‌, జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రభాకర్‌, సలహాదారు మనోహర్‌స్వామి ఉన్నారు.

జాతీయ స్థాయి క్రీడాకారులకు సన్మానం

ఆదిలాబాద్‌: ఏపీలోని చీరాలలో నిర్వహించిన జాతీయ స్థాయి సబ్‌ జూనియర్‌, జూనియర్‌ షూటింగ్‌ బాల్‌ పోటీల్లో తెలంగాణ బాలుర, బాలికల జట్లు తమ ప్రతిభ చాటాయి. సబ్‌ జూనియర్‌లో బాలురలో తెలంగాణ మొదటి స్థానం, జూనియర్‌లో ద్వితీయ స్థానం, సబ్‌ జూనియర్‌ బాలికల్లో తృతీయ స్థానంలో నిలిచి బంగారు, రజక, కాంస్య పతకాలను కైవసం చేసుకున్నాయి. క్రీడాకారులు శనివారం ఆదిలాబాద్‌ చేరుకున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర షూటింగ్‌ బాల్‌ సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు రవికుమార్‌, క్రాంతికుమార్‌, కోశాధికారి హరిచరణ్‌, జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి రాష్ట్ర పాల్‌, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి క్రీడాకారులకు రైల్వే స్టేషన్‌ వద్ద ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం వారిని పూలమాలతో సన్మానించారు.

ప్రారంభమైన జంగీ జాతర


పూజలు చేస్తున్న కొరంగే వంశీయులు


డోల్‌ వాయిద్యాలతో ఆదివాసీల శోభాయాత్ర

బేల: మండలంలోని సదల్‌పూర్‌ గ్రామ శివారులోని బైరందేవ్‌, మహాదేవ్‌ ఆలయంలో కొరంగే వంశీయుల ప్రత్యేక పూజలతో శనివారం జంగీ జాతర ప్రారంభమైంది. ఆదివాసీ పూర్వీకుల సంప్రదాయ బద్ధంగా డోల్‌ వాయిద్యాలు, భజన కీర్తనల మధ్యన ఊరేగింపు ర్యాలీని జంగోలింగో దీక్షాపరులు చేపట్టారు. బైరందేవ్‌, మహాదేవ్‌ ఆలయాల్లో లింగాలకు మండల రాయిసెంటర్‌ అధ్యక్షుడు కొరంగే సోనేరావు దంపతులు ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. నందీశ్వరుడు, బైరందేవుడు, శివలింగం విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత ఆలయ కమిటీ సభ్యులు జాతర ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొరంగే శ్యాంరావు, ప్రధాన కార్యదర్శి సిడాం కుషాల్‌ రావు, కార్యదర్శి పెందుర్‌ రాందాస్‌, ఆదివాసి పర్దాన్‌ సంఘం మండల అధ్యక్షుడు నైతం సీతరాం, ఎంపీటీసీ కొడపే అరుణ్‌, మాజీ సర్పంచ్‌లు కొరంగే జంగ్‌షా, ఆడ శంకర్‌ పాల్గొన్నారు.